

పింఛన్లు సాధిస్తాం..

ప్రభుత్వం మెడలు వంచి రూ.6 వేల పింఛన్ సాధిస్తామని మందకృష్ణ అన్నారు.

వివరాలు 8లో ▸



..1.15 లక్షల క్యూసెక్కులు

జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 1.15 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుంది.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.0 /21.8

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కందనూలు/మన్ననూర్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను అతిథి అధ్యాపక పోస్టుల భర్తీ నిమిత్తం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మదన్మోహన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, ఇంగ్లిష్, కెమిస్ట్రీ, జువాలజీ, డైరీ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్ సబ్జెక్టుల్లో బోధించేందుకు ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం 12గంటలలోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నెట్, సెట్, పీహెచ్‌డి అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు.

■ అమ్రాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు–1, కామర్స్–2, ఇంగ్లిష్–1, హిస్టరీ–1, ఎకనామిక్స్–1, పొలిటికల్ సైన్స్–1, జువాలజీ–1, కంప్యూటర్ సైన్స్–1 ఖాళీల భర్తీకి అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గోపాల్ తెలిపారు. ఆయా సబ్జెక్టులకు సంబంధించి పీజీలో 55 శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. సెట్, నెట్, స్లేట్, పీహెచ్‌డీ కలిగి ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు ఈ నెల 22వ తేదీలోగా కళాశాలలో నేరుగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరింత సమాచారం కోసం 85228 73729, 83319 58940 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'కాలగమనం' పుస్తకావిష్కరణ



అచ్చంపేట: ప్రముఖ కవి ఎంఏ గఫార్ రచించిన కాలగమనం పుస్తకాన్ని ఆదివారం పట్టణంలోని గురుకుల పాఠశాలలో తెలంగాణ ప్రముఖ కవి, వక్త, సాహితీవేత్త నాగేశ్వరం శంకరం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంఏ గఫార్ మాతృభాష ఉర్దూ అయినప్పటికీ తెలుగులో కవిగా రాణించడం గొప్ప విషయమన్నారు. తెలుగు భాషపై ఉన్న మక్కువతో నల్లమల రత్నాలు, ప్రజాప్రస్థానం, మేలుకొలుపు తదితర రచనలు చేసినట్లు ఆయన గుర్తు చేశారు. మకట శతకంలో వచన కవిత్వాన్ని రచించడం చాలా అరుదు అని.. అలాంటి వారిలో ఉమ్మడి పాలమూరు జిల్లా నుంచి ఆయన ముందు వరుసలో ఉంటారన్నారు. ఇలాంటి కవులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం పుస్తకావిష్కరణ సభలో పాల్గొన్న కవులను డాక్టర్ బాలనారాయణ శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కవులు వల్లభాపురం జనార్దన్, కర్నాటి రఘురాములుగౌడ్, ముచ్చర్ల దినకర్, వనపట్ల సుబ్బయ్య, సాయి జ్యోతి, కాటమరాజు నరసింహులు, ఎదురవల్లి కాశన్న, ఖాజా మైనొద్దీన్, కందికొండ మోహన్ పాల్గొన్నారు

కనీస వేతన చట్టం అమలు చేయాలి

కొల్లాపూర్: రాష్ట్రంలో కార్మికులకు కనీస వేతన చటం అమలుచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వి.పర్వతాలు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో రైస్‌మిల్ హమాలీలతో ఆయన సమావేశమై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ.. తీరని అన్యాయం చేస్తున్నాయన్నారు. కార్పొరేట్ సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకే 10 గంటల పని విధానాలను అమల్లోకి తీసుకొచ్చారని విమర్శించారు. కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ, సలీం, సత్యం, పకీరా తదితరులు ఉన్నారు.

కోయిల్‌సాగర్‌లో పెరుగుతున్న నీటిమట్టం

దేవరకద్ర/ చిన్నచింతకుంట: కోయిల్‌సాగర్‌లో నీటిమట్టం ఆదివారం సాయంత్రం వరకు 24.6 అడుగులకు చేరింది. జూరాల నుంచి కేవలం ఒక పంపును రన్ చేసి 315 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. రెండు పంపులు రన్ చేస్తే 630 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులోకి చేరే అవకాశం ఉంది. దీంతో కాల్వల ద్వారా నీటిని వదిలిన ప్రాజెక్టు నీటిమట్టం వేగంగా పెరిగే అవకాశం ఉంటుంది. ఇదిలా ఉండగా.. స్థానికంగా కురుస్తున్న వర్షాలతో బండర్‌పల్లి చెక్‌డ్యాం నుంచి ఆదివారం అలుగు పారింది. చెక్‌డ్యాం వల్ల చుట్టుపక్కల ఉండే గ్రామాల్లో భూగర్భజలాలు పెరుగుతాయని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



స్వచ్ఛతలో వెనుకంజ!



అచ్చంపేట మున్సిపాలిటీ కార్యాలయం



- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దిగజారుతున్న ర్యాంకులు
- గతేడాదితో పోలిస్తే చాలా వరకు వెనుకబాటు
- స్వచ్ఛత యాప్ వినియోగంపై అవగాహన కరువు
- ప్రజల భాగస్వామ్యంతోనే మెరుగైన ర్యాంకులు సాధ్యం

అచ్చంపేట రూరల్: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఏడాదికేడాది జిల్లాలోని మున్సిపాలిటీలు వెనకబడుతున్నాయి. సంబంధిత అధికారుల అలసత్వానికి తోడు ప్రజల్లో అవగాహన కొరవడటంతో మెరుగైన ర్యాంకులు సాధించలేకపోతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది పట్టణాభివృద్ధిశాఖ, స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో మున్సిపాలిటీలకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను ప్రకటిస్తోంది. ఇందుకు గాను ప్రత్యేకంగా సర్వే నిర్వహించి.. పారిశుద్ధ్యం, శుభ్రత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు స్వచ్ఛత యాప్ ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరిస్తుంది. తద్వారా ప్రతి ఒక్కరిలో పోటీతత్వం పెంచి స్వచ్ఛ పట్టణాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోంది.

తిరోగమనం దిశగా..

కేంద్ర ప్రభుత్వం 2024–25 సంవత్సరానికి గానూ పట్టణాల్లోని జనాభా ఆధారంగా జాతీయ, రాష్ట్రస్థాయి ర్యాంకులు వెల్లడించింది. జిల్లాలోని నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ మున్సిపాలిటీలు గతేడాదితో పోలిస్తే చాలా వరకు వెనకబడ్డాయి. రాష్ట్రస్థాయిలో మాత్రం నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ కొంత మెరుగైన ర్యాంకు సాధించగా.. మిగతా మున్సిపాలిటీలు తిరోగమనం దిశగా పయనిస్తున్నాయని స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులను బట్టి చెప్పవచ్చు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మంచి ర్యాంకులు సాధించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించింది. అందులో భాగంగా పట్టణాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ మెరుగైన ఫలితాలు సాధించడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ప్రజల భాగస్వామ్యమేది?

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మున్సిపాలిటీ మెరుగైన ర్యాంకు సాధించడంలో అధికార యంత్రాంగంతో పాటు పట్టణ ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకం. ప్రజల అభిప్రాయాలు తెలుసుకునేందుకు గాను ప్రభుత్వం ప్రత్యేకంగా స్వచ్ఛత యాప్ రూపొందించింది. ఈ యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే ఒక మార్కు, ఫిర్యాదు నమోదైన వెంటనే పరిష్కరిస్తే రెండు మార్కులు, 6గంటల సమయం దాటిన తర్వాత సమస్యను పరిష్కరిస్తే ఒక మార్కు కేటాయిస్తారు. అయితే ఈ యాప్ వినియోగంపై ప్రజలకు అవగాహన కరువైంది. స్వచ్ఛత యాప్ వినియోగం, ప్రాధాన్యతపై పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

ఏం చేయాలంటే..

జిల్లాలోని మున్సిపాలిటీల్లో స్వచ్ఛతను మెరుగు పరిచేందుకు మరిన్ని చర్యలు చేపట్టాల్సిన అవసరముంది. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు మన పట్టణాన్ని మనమే పరిశుభ్రంగా ఉంచాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో పెంపొందించాలి. బహిరంగంగా మల, మూత్ర విసర్జన చేయకుండా చర్యలు చేపట్టాలి. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించడంపై గృహ యజమానులకు అవగాహన కల్పించాలి. ప్లాస్టిక్ నిషేధం వందశాతం అమలు చేయాల్సిన ఆవశ్యకత ఉంది. పట్టణాల్లో ప్లాస్టిక్‌పై నియంత్రణ లేకపోవడంతో ప్రతినెలా టన్నుల కొద్దీ ప్లాస్టిక్ డంపింగ్‌యార్డుకు చేరుతోంది.

■ అచ్చంపేట మున్సిపాలిటీలో 34,500 మంది జనాభా ఉండగా, 18.79 చదరపు కి.మీ.ల విస్తీర్ణం కలిగి ఉంది. నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీ 55.19 చదరపు కి.మీ. విస్తీర్ణం కలిగి ఉండగా.. 36,912 మంది జనాభా ఉన్నారు. కల్వకుర్తిలో 40వేల మంది జనాభా, 36.6 చదరపు కి.మీ. విస్తీర్ణం, కొల్లాపూర్‌లో 25,049 మంది జనాభా ఉండగా.. 20 చదరపు కి.మీ. విస్తీర్ణం కలిగి ఉన్నాయి.

మున్సిపాలిటీల వారీగా ర్యాంకులు ఇలా..

మున్సిపాలిటీ	జాతీయస్థాయి		రాష్ట్రస్థాయి	
	2023-24	2024-25	2023-24	2024-25
అచ్చంపేట	1,191	833	90	84
కల్వకుర్తి	1,454	827	106	83
కొల్లాపూర్	3,013	1,112	129	114
నాగర్‌కర్నూల్	1,101	908	77	92

అవగాహన కల్పిస్తాం..



పట్టణంలో క్రమం తప్పకుండా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నాం. చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టిసారించాం. తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరిస్తున్నాం. స్వచ్ఛత యాప్ వినియోగంపై ఇప్పటికే పట్టణ ప్రజలకు అవగాహన కల్పించాం. మహిళా సంఘాలతో కలిసి కాలనీల్లో స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. మున్సిపాలిటీ మెరుగైన ర్యాంకు సాధించడానికి అందరూ సహకరించాలి.

– మురళి, మున్సిపల్ కమిషనర్, అచ్చంపేట

అతివల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



కల్వకుర్తిలో స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్ తదితరులు

కల్వకుర్తి టౌన్/కల్వకుర్తి రూరల్: రాష్ట్రంలోని ప్రతి మహిళ ఆర్థికంగా అభివృద్ధి సాధించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఇందిరా మహిళాశక్తి సంబురాల్లో వారు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టినా మహిళలకే ప్రథమ ప్రాధాన్యత ఇస్తుందన్నారు. మహిళా సంఘాల సభ్యులను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం మహిళాశక్తి క్యాంటీన్లు, పెట్రోల్ బంక్‌లు, ఆర్టీసీకి అద్దె బస్సులు, సోలార్ ప్లాంట్లు తదితర యూనిట్లు ఏర్పాటు చేయిస్తుందన్నారు. జిల్లాలో 5వేల మందికి ఇందిరా మహిళాశక్తి ద్వారా రుణాలు అందించడంతో వివిధ వ్యాపారాల్లో రాణిస్తున్నారని తెలిపారు. అదే విధంగా కల్వకుర్తికి మంజూరైన 2,500 రేషన్ కార్డుల్లో 5,800 మంది పేర్లను నమోదు చేశామన్నారు. అనంతరం కల్వకుర్తి నియోజకవర్గంలోని 57 ఎస్‌హెచ్‌జీలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ. 5.47కోట్లు, 1,387 మంది ఎస్‌హెచ్‌జీ సభ్యులకు రూ. 1.57కోట్ల రుణాలు, 14మంది సభ్యులకు రూ. 6.88లక్షల బీమా చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఏడీఆర్డీఓ రాజేశ్వరి, ఆర్డీఓ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భూ భారతి దరఖాస్తులు పరిష్కరించాలి..

భూ భారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. కల్వకుర్తి తహసీల్దార్ కార్యాలయంలో ఆయన రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. భూ భారతి రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై అందిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, కొత్త చట్టం ద్వారా పరిష్కరించాలని సూచించారు. ఏదైనా దరఖాస్తు తిరస్కరణకు గురైతే, అందుకు గల కారణాలను రాత పూర్వకంగా ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా, కల్వకుర్తి డివిజన్‌లో మొత్తం 3,126 దరఖాస్తులు అందగా.. 2,040 దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేశామని ఆర్డీఓ శ్రీను తెలిపారు. మరో 1,846 దరఖాస్తులను ఆమోదించామని.. 1,280 దరఖాస్తులను తిరస్కరించినట్లు వివరించారు.

మహిళా సంక్షేమానికి పెద్దపీట



మహిళలకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ

కందనూలు: మహిళల ఆత్మవిశ్వాసమే సమాజం పురోగతికి మూలమని.. అందుకు అనుగుణంగా మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం బలమైన పునాది వేస్తుందని ఎమ్మెల్యేలు కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి, డా.చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన మహిళాశక్తి సంబురాల్లో అదనపు కలెక్టర్ అమరేందర్‌తో కలిసి వారు పాల్గొని మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తోందన్నారు. మహిళలందరూ కోటీశ్వరులుగా మారాలనే లక్ష్యంతో అన్ని రంగాల్లోనూ ప్రోత్సాహాన్ని, అవకాశాలను కల్పిస్తున్నట్లు వివరించారు. 1992లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసం డ్వాక్రా పథకాన్ని ప్రారంభించారని అన్నారు. ఆ పథకాన్ని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఐకేపీగా నామకరణం చేసి మహిళల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. మళ్లీ ఇప్పుడు ఇందిరమ్మ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేసి అనేక పథకాలు అమలు చేస్తోందని వివరించారు. కాగా, నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పరిధిలోని 254 స్వయం సహాయక మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ. 14.22కోట్లు, 2,568 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ. 3.03కోట్ల రుణాల చెక్కులతో పాటు ఐదుగురు సభ్యులకు రూ. 50లక్షల ప్రమాద బీమా చెక్కు, 28 మంది సభ్యులకు రూ. 17.40లక్షల లోన్ బీమా చెక్కులను ఎమ్మెల్యేలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి ఎంపిక పోటీలు



లాంగ్ జంప్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

కల్వకుర్తి రూరల్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లాస్థాయి అథ్లెట్లు, జావెలిన్ త్రో క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్– 8, 10, 12, 14, 16, 18, 20 బాలబాలికలకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించగా.. ఉత్సాహంగా పాల్గొన్నారు. వచ్చే నెల 7న నేషనల్ జావెలిన్ డే ను పురస్కరించుకొని జనగాంలో నిర్వహించే నాలుగో నేషనల్ జావెలిన్ డే వేడుకలు, కిడ్స్ అథ్లెటిక్స్ మీట్‌లో ఎంపికైన జిల్లా క్రీడాకారులు పాల్గొంటారని అసోసియేషన్ అధ్యక్షుడు విజయేందర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి స్వాములు తెలిపారు. కాగా, ఎంపిక పోటీలను పట్టణ రెండో ఎస్‌ఐ రాజశేఖర్ ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు, మెమొంటోలు బహుకరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో రాణించి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీడీలు బాలసుబ్రహ్మణ్యం, ప్రసాద్, అంజయ్య, రాజు, రాజేందర్, సరస్వతి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆలోచించండి.. ఆవిష్కరించండి

నూతన ఆవిష్కరణలకు 'ఇన్నోవేషన్ ఇన్‌స్పైర్ మనక్' వేదిక

- విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి.. నైపుణ్యం పెంపొందించడమే లక్ష్యం
- సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తుల స్వీకరణ
- ప్రతి పాఠశాల నుంచి ప్రాజెక్టులకు ఆహ్వానం
- ఉమ్మడి జిల్లాలో గతేడాది 3,658 దరఖాస్తులు

inspire awards - manak

నారాయణపేట రూరల్: విద్యార్థి ఆలోచనలకు సృజనాత్మకత జోడించి.. కొత్త ఆవిష్కరణలు రూపకల్పన చేసేలా ప్రోత్సహిస్తోంది ఇన్నోవేషన్ ఇన్‌స్పైర్ మనక్ వేదిక. ఈ ఏడాది నుంచి వేదికల్లో ప్రదర్శించే అంశాల్లో నాణ్యతపై దృష్టిపెట్టింది. మూస విధానాలు, ఒకరిని చూసి మరొకరు కొద్ది పాటి మార్పులతో ప్రయోగాలు అనుకరించకుండా ఉండేందుకు కొత్త ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టింది. కోవిడ్ సమయంలో విద్యార్థులకు నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ రాష్ట్ర సాంకేతిక మండలి సహకారంతో పాఠశాల విద్యార్థుల కోసం ఒక వేదికను తయారు చేసింది. ఇందులో అన్ని ప్రభుత్వ, అనుబంధ విద్యా సంస్థల్లో చదువుతున్న ఆరు నుంచి ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, వారికి బోధించే ఉపాధ్యాయులతో కలిసి పాల్గొనే అవకాశం కల్పించింది. ఇందుకోసం ఇద్దరు విద్యార్థులతో కూడిన జట్టుతో ప్రతి పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్టులకు మించకుండా దరఖాస్తులు స్వీకరించనున్నారు.

ఆ ప్రయోగాలకు నోచాన్స్

నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ స్కిల్ ఇండియా, మేకింగ్ ఇండియా, స్వచ్ఛ భారత్, మరి కొన్ని అనే నాలుగు విభాగాల్లో దరఖాస్తులు తీసుకుంటుంది. అయితే వివిధ రకాలైన ప్రయోగాల్లో రెగ్యులర్‌గా అనుకరణలు వస్తున్నాయని గుర్తించారు. విద్యార్థులు, సంబంధిత సైన్స్ టీచర్లు ఇవి కొత్తగా కనిపించినా సంస్థ మాత్రం చాలా సులువుగా గుర్తిస్తుంది. దీనికితోడు గతంలో ప్రదర్శించిన వాటికి అనుమతి ఉండదని చెబుతోంది. ఇప్పటి వరకు గుర్తించిన వాటిలో.. నిరుపయోగంగా ఉన్న బ్యాటరీల ద్వారా విద్యుత్, శక్తి ఉత్పత్తి, వర్షపునీటి వినియోగం, నీటి నిల్వ స్థితి– హెచ్చరిక యంత్రాలు, వంటగ్యాస్, అగ్నిప్రమాదాలు– అప్రమత్తం చేసే యంత్రాలు, వర్మీ కంపోస్టు, లెటర్‌బాక్స్, అలారం, బిందుసేద్యం, సెన్సార్ ఆధారిత ప్రదర్శనలు, అప్రయత్నంగా వీధిదీపాల నిర్వహణ, ఆహార పదార్థాల కల్తీ గుర్తింపు, కార్బన్ సైకిల్, ఆహార గొలుసు, మానవ శరీర అవయవాల ప్రదర్శన, నక్షత్ర మండలం, జలశుద్ధి వంటి పాఠ్యపుస్తకాలు, యూట్యూబ్‌లలో చూసిన ప్రదర్శనలు అనుమతించరు. ముఖ్యంగా ప్లాస్టిక్ రహిత ప్రయోగాలు ఉండాలని నిబంధన ఉంది. మెరుగైన కొత్త వాటికి మాత్రమే అర్హత ఉంటుంది.



నారాయణపేట నుంచి జాతీయ స్థాయికి ఎంపికైన ప్రాజెక్టు (ఫైల్)

2024- 25 దరఖాస్తుల వివరాలిలా..

జిల్లా	దరఖాస్తులు	ఎంపికైనవి
వనపర్తి	1,250	123
నాగర్‌కర్నూల్	890	90
మహబూబ్‌నగర్	560	65
జోగులాంబ గద్వాల	550	52
నారాయణపేట	320	19

గతేడాది జాతీయ స్థాయికి..

గతేడాది నారాయణపేట జిల్లా దామరగిద్ద గురుకుల విద్యార్థి ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైంది. ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా గతేడాది 3,658 దరఖాస్తులు రాగా వాటిలో ఐదు జిల్లాల్లో కలిపి 349 ఎంపిక చేశారు. ఇందులో అత్యుత్తమంగా ఉన్న 10 శాతం ప్రాజెక్టులను స్క్రూటినీ చేసి రాష్ట్రస్థాయికి నామినేట్ చేసి ఒక్కొక్కరికి రూ.10 వేల నగదు ఖర్చులకు అందిస్తారు. ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్రస్థాయిలో పాల్గొన్న వాటిలో ఇప్పటి వరకు జాతీయ స్థాయికి, అంతర్జాతీయ స్థాయిలో ఒకే ఒక్క ప్రాజెక్టు ఎంపికైంది. సింగారం చౌరస్తాలో గల దామరగిద్ద గురుకుల స్కూల్ (ప్లాస్టిక్ నివారిస్తూ కొబ్బరి పీచుతో చేసిన కుండీలతో కాలుష్యాన్ని నివారించి పర్యావరణ పరిరక్షణ) ప్రాజెక్టు ఇటీవల జపాన్‌లో జరిగిన సకురా సైన్స్ ప్రోగ్రాంలో పాల్గొనే అవకాశం లభించింది. మొదట ఉపాధ్యాయుల నామినేషన్ ప్రక్రియను ఏర్పాటు చేసి ఎస్‌ఐసీ ద్వారా వృత్తిపరమైన వివరాలు అంతర్జాలంలో నిక్షిప్తం చేశారు. రాష్ట్ర ఇన్నోవేషన్ సెల్‌లో నమోదై తదుపరి అన్ని రకాల సమాచారం టీచర్ సెల్‌కు అందుతుంది. సంబంధిత ఉపాధ్యాయుడికి జూమ్ లేదా మరో ప్రసార మాధ్యమం ద్వారా సంబంధిత అంశంపై అవగాహన కల్పిస్తారు.


పాల్గొనేందుకు అర్హతలు

- ■ ప్రభుత్వ, ప్రైవేటు, జెడ్పీ, ఎయిడెడ్, కేజీబీవీ, మోడల్, మైనార్టీ, గురుకులాల్లో 6 నుంచి 12వ తరగతి చదువుతున్న విద్యార్థులు
- ■ యూపీఎస్ నుంచి రెండు, హైస్కూల్ నుంచి ఐదు, కళాశాల నుంచి రెండు చొప్పున ప్రాజెక్టులు గరిష్ఠంగా ఆన్‌లైన్ చేయవచ్చు
- ■ ప్రతి తరగతి ఒక సబ్జెక్ట్ ఎంపిక చేసుకోవాలి

దరఖాస్తు పద్ధతి ఇలా..

- ■ www.inspireawards.gov.in వెబ్‌సైట్‌లో స్కూల్ కోడ్ ద్వారా లాగిన్ అవ్వాలి. యూడైస్, పాస్‌వర్డ్ కొడితే వెబ్‌సైట్ ఓపెన్ అవుతుంది.
- ■ విద్యార్థి పేరు, తండ్రి పేరు, తరగతి నమోదు చేయాలి.
- ■ విద్యార్థికి సంబంధించిన బ్యాంకు అకౌంట్ నంబర్ (జాతీయ బ్యాంకుల్లో), ఆధార్ నంబర్ నమోదు చేయాలి.
- ■ విద్యార్థి ప్రాజెక్టు సంక్షిప్తంగా రాతపూర్వకంగా పొందుపరిచి, సంబంధిత రైటప్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి.
- ■ ప్రాజెక్టు పేరు, శాస్త్ర సాంకేతికతకు సంబంధించిన అంశాలు ఉండేలా చూసుకోవాలి.
- ■ ప్రాజెక్టు ఎంపిక రెండు నెలల్లో పూర్తి చేసి జిల్లాస్థాయిలో ప్రకటిస్తారు. వాటిని రాష్ట్ర స్థాయికి పంపిస్తారు.
- ■ ఎంపికైన ప్రాజెక్టుకు రూ.10 వేల నగదు ప్రయోగ నిమిత్తం బ్యాంకు అకౌంట్లో జమచేస్తారు.
- ■ సెప్టెంబర్ 15 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.
- ■ ప్రతి పాఠశాలలో ఐడియా బాక్స్‌లను ఏర్పాటు చేయాలి.


సృజనాత్మకత వెలికితీయాలి



విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఇలాంటి సైన్స్‌ఫేర్లు ఎంతో ఉపకరిస్తాయి. కొత్త ఆవిష్కరణలు ప్రోత్సహిస్తున్న ఇన్నోవేషన్ ఇన్‌స్పైర్ మనక్ ముఖ్యంగా నాణ్యత, సైన్స్ అభివృద్ధికి దోహదపడుతుంది. పూర్తిగా కొత్త వాటిని పరిచయం చేసేందుకు విద్యార్థులను సిద్ధం చేయాలి. గణితం, సామాన్యంపై దృష్టిపెట్టేలా సంబంధిత టీచర్లు చొరవ చూపాలి. ప్రతి పాఠశాలలో ఐడియా బాక్స్ ఏర్పాటు చేసి పిల్లల ఇన్నోవేషన్‌లను స్వీకరించాలి.

– భానుప్రకాష్, జిల్లా సైన్స్ అధికారి, నారాయణపేట

కొత్త ఆలోచనలతో రావాలి



గత సైన్స్‌ఫేర్‌లో ప్రదర్శించిన ప్రయోగాలు వద్దు. కొత్త ఆవిష్కరణలతో ముందుకు రావాలని సూచించాం. ఇప్పటికే గైడ్ టీచర్లకు అవసరమైన సలహాలు అందించాం. త్వరలో టీచర్లకు అవగాహన కల్పిస్తారు. తర్వాత విద్యార్థులకు గైడ్ చేయాల్సి ఉంటుంది. సెప్టెంబర్ 15 వరకు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోడానికి అవకాశం ఉంది. ఎక్కువ సంఖ్యలో ప్రాజెక్టులు తయారు చేసేలా విద్యార్థులను ప్రోత్సహించాలి. సందేహాలు ఉంటే డీఎస్‌ఓను సంప్రదించండి.

– గోవిందరాజులు, డీఈఓ, నారాయణపేట



జూరాల ప్రాజెక్ట్‌పై పర్యాటకుల సందడి



జూరాల ఎడమ కాల్వ వద్ద వాహనదారులతో మాట్లాడుతున్న సీఐ శివకుమార్



చేపల వంటకాల వద్ద బారులు తీరిన ప్రజలు

జూరాలకు బారులుదీరారు



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు సందర్శకులతో కిటకిటలాడింది. ఎగువ నుంచి భారీగా వరద వస్తుండటంతో 19 గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. దీంతో జల పరవళ్లను తిలకిస్తూ.. ప్రాజెక్టు అందాలను మొబైల్ ఫోన్లలో చిత్రీకరించేందుకు పోటీపడ్డారు. ఆదివారం సెలవురోజు కావడంతో స్థానికులతోపాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున సందర్శకులు తరలిరావడంతో కిలోమీటర్ మేర ట్రాఫిక్ జాం అయ్యింది. అలాగే చేపల వంటకాలను రుచి చూసేందుకు పర్యాటకులు ఆసక్తి చూపారు. ఇదిలా ఉండగా.. జూరాల ప్రాజెక్టుకు భారీ వరద వస్తుండడంతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ ఆదేశాల మేరకు సీఐ శివకుమార్ ఆధ్వర్యంలో ఆత్మకూరు రెండో ఎస్‌ఐ హిమబిందు 50 మంది పోలీసులతో గట్టి భద్రతను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తూ.. ప్రజలు ప్రమాదకర ప్రాంతాల్లోకి వెళ్లకుండా చర్యలు చేపట్టారు.

- అమరచింత (ఆత్మకూర్)



క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ఊట్కూరు: జీవనోపాధికై పేయింటింగ్ పని చేస్తూ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి చికిత్స పొందుతూ కుర్వ మల్లేశ్(25) మృతిచెందిన ఘటన మండలంలోని అమీన్‌పూర్‌లో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొంటి సైబన్న కుమారుడు కుర్వ మల్లేశ్ కొంతకాలంగా ఇళ్లకు పెయింటింగ్ వేసేవాడు. వారం రోజుల క్రితం పగిడిమారిలో కుర్వ బాలరాజు ఇంటికి పెయింటింగ్ వేయడానికి కూలీ పనికి వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్‌లు తగలడంతో కిందపడిపోయాడు. మహబూబ్‌నగర్ ఎస్‌వీఎస్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. ఈ విషయమై ఎస్‌ఐ రమేశ్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి

పేయింటింగ్ పనిచేస్తూ మృతిచెందిన మల్లేశ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని భారతీయ కిసాన్ సంగ్ నాయకులు మైపాల్‌రెడ్డి, వెన్‌కోబా, నాగార్జున ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

కృష్ణా: మండంలోని గుర్జాల్ గ్రామానికి చెందిన శంకర్ (29) ఆదివారం తెల్లవారుజామున టైరోడ్‌లో బస్సు దిగి నడచుకుంటూ వస్తుండగా వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహం గుర్తుపట్టని విధంగా నుజ్జునుజ్జు కావడంతో వాహనదారులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎండీ నవీద్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆగిన లారీని కారు ఢీ: వ్యక్తి మృతి

వనపర్తి రూరల్: ఆగిన ఉన్న లారీని కారు ఢీకొట్టడంతో ఓ వ్యక్తికి మృతి చెందడంతో పాటు ఒకరికి గాయాలయిన ఘటన శనివారం అర్ధరాత్రి పెబ్బేరు మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ యుగేంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కర్నూల్‌కు చెందిన దూదేకుల చిన్న కాశీంసాబ్ (37)షాద్‌నగర్ శివారులోని ఎంఎస్ఎన్ ల్యాబ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం రాత్రి షాద్‌నగర్ నుంచి భార్య పద్మప్రియతో కలిసి ఆయన కారులో కర్నూల్‌కు వెళ్తుండగా.. రంగాపురం శివారులోని జాతీయ రహదారి 44పై సందర్శిని హోటల్ వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో దూదేకుల చిన్న కాశీంసాబ్ తల, ముఖానికి బలమైన గాయాలై అక్కడిక్కడే మృతి చెందాడు. భార్య పద్మప్రియ ఎడమ కాలు విరిగడంతో పాటు ముఖానికి రక్త గాయాలు కాగా 108 అంబులెన్స్‌లో వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కర్నూల్ కిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి అన్న దూదేకుల ఖాసీం పెబ్బేరు పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి బలవన్మరణం



రాములు (ఫైల్)

మరికల్: మతిస్థిమితం సరిగా లేని ఓ వ్యక్తి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన పల్లెగడ్డ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని పల్లెగడ్డకు చెందిన కాటేకొండ రాములు(48) వ్యవసాయ పొలానికి వెళ్లి వస్తానని భార్య లక్ష్మితో చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. పొలం దగ్గరకు వెళ్లిన ఆయన దోస తోట కోసం తెచ్చిన పురుగుల మందును తాగి అపస్మారక స్థితిలో చేరుకున్నాడు. గమనించిన భార్య చుట్టుపక్కల రైతుల సహకారంతో మరికల్‌లోని ఆస్పత్రికి తీసుకొచ్చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మహబూబ్‌నగర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్ మజీద్ తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

ఇటు కోచ్‌గా.. అటు క్రీడాకారుడిగా

- నెట్‌బాల్‌లో విక్రమ్ ఆదిత్యరెడ్డి ప్రతిభ
- 35కుపైగా జాతీయస్థాయి టోర్నీల్లో రాష్ట్రానికి ప్రాతినిధ్యం
- అంతర్జాతీయ పోటీల్లో భారత మహిళా జట్లకు కోచ్‌గా సేవలు
- తెలంగాణ నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగానూ బాధ్యతలు
- ఒకే క్రీడలో మూడు విభాగాల్లో ప్రాతినిధ్యం వహిస్తూ ప్రత్యేక గుర్తింపు



ట్రోఫీతో విక్రమ్ ఆదిత్యరెడ్డి

మహబూబ్‌నగర్ క్రీడలు: తాను ఇష్టపడిన నెట్‌బాల్ క్రీడపై ఆసక్తి కనబరుస్తూ ఉత్తమ క్రీడాకారుడిగా ప్రతిభ కనబరుస్తున్నాడు హన్వాడ మండలానికి చెందిన విక్రమ్ ఆదిత్యరెడ్డి. 35కు పైగా జాతీయ స్థాయిలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించి రజత, కాంస్య పతకాలు సాధించిపెట్టాడు. ఎంచుకున్న క్రీడకే భారత మహిళా జట్టుకు కోచ్‌గా ఎంపికయ్యాడు. అలాగే నెట్‌బాల్ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గానికి అధ్యక్షుడిగా కొనసాగుతూ.. ఒకే క్రీడలో మూడు విభాగాల్లో ప్రాతినిధ్యం వహిస్తూ తెలంగాణలోనే ప్రత్యేక గుర్తింపు పొందాడు పాలమూరు క్రీడాకారుడు.

నెట్‌బాల్ ప్రయాణం

విక్రమ్ ఆదిత్యరెడ్డి 2003లో నెట్‌బాల్ ప్రయాణాన్ని ప్రారంభించారు. 2004 హైదరాబాద్‌లో నిర్వహించిన సబ్ జూనియర్ జాతీయ చాంపియన్‌షిప్‌లో మొదటి జాతీయ టోర్నీలో పాల్గొన్నారు. అప్పటి నుంచి దేశవ్యాప్తంగా దాదాపు 35 జాతీయ స్థాయి టోర్నీలలో రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించాడు. సీనియర్ జాతీయ స్థాయి నెట్‌బాల్ పోటీల్లో నాలుగు కాంస్య పతకాలు సాధించారు. 2013లో జార్ఖండ్, 2022లో గుజరాత్ భావ్‌నగర్‌లో, ఈ ఏడాది ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగిన నేషనల్ గేమ్స్‌లో పాల్గొన్నారు. గుజరాత్ నేషనల్ గేమ్స్‌లో తెలంగాణ జట్టు ద్వితీయ స్థానం రజతం, ఉత్తరాఖండ్‌లో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం పొందారు.

భారత మహిళా జట్లకు కోచ్‌గా సేవలు

విక్రమ్ ఆదిత్యరెడ్డి నెట్‌బాల్‌లో క్రీడాకారుడిగా ఆడుతూనే మరోపక్క భారత మహిళా జట్లకు పలుమార్లు కోచ్‌గా సేవలు అందించడం విశేషం. కోచ్‌గా క్వాలీఫై కావడానికి సింగపూర్‌లో 2021 నుంచి ఈ ఏడాది వరకు ఏషియన్ కోచింగ్ కోర్సును పూర్తిచేసి లెవల్–3 కోచ్ సర్టిఫికెట్ అందుకున్నారు. ఇప్పటివరకు నాలుగుసార్లు అంతర్జాతీయ నెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్న భారత మహిళా జట్లకు కోచ్‌గా వ్యవహరించారు. 2022లో సింగపూర్‌లో జరిగిన ఏషియా మహిళల నెట్‌బాల్ చాంపియన్‌షిప్, 2024లో బెంగుళూర్‌లో జరిగిన ఆసియా నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో భారత మహిళా జట్లకు కోచ్‌గా ఉన్నారు. అదేవిధంగా ఈ ఏడాది జూన్‌లో హాంకాంగ్‌లో నిర్వహించిన బౌహినియా కప్‌లో, దక్షిణా కొరియా జియెంజోలో జరిగిన ఏషియన్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో హెడ్ కోచ్‌గా వ్యవహరించి జట్టును ముందుకు నడిపించారు. హాంకాంగ్‌లో టోర్నీలో ఇండియన్ మహిళా జట్టు మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించగా దక్షిణా కొరియాలో జరిగిన టోర్నీలో మహిళా జట్టు ఐదో స్థానంలో నిలిచింది.

అంతర్జాతీయ స్థాయిలో ఆడాలన్నదే లక్ష్యం

నెట్‌బాల్ అంటే చిన్నప్పటి నుంచి ఎంతో ఇష్టం. ఎన్నో రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నా. కోచ్‌గా భారత మహిళా జట్టుకు పనిచేయడం చాలా సంతోషంగా ఉంది. నాకు కోచ్‌గా అవకాశం కల్పిస్తున్న నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు ధన్యవాదాలు. కోచ్‌గా ఉన్నప్పటికీ క్రీడాకారుడిగా పోటీల్లో పాల్గొంటున్న. అంతర్జాతీయ స్థాయి నెట్‌బాల్ టోర్నీలో ఇండియా జట్టు తరఫున ఆడాలన్నదే లక్ష్యం. అందుకు నిరంతరం శ్రమిస్తున్న.

– విక్రమ్ ఆదిత్యరెడ్డి, క్రీడాకారుడు, కోచ్

నెట్‌బాల్ తెలంగాణ అధ్యక్షుడిగా

నెట్‌బాల్ క్రీడపై ఉన్న ఆసక్తితో క్రీడను రాష్ట్రంలో క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లాలనే సంకల్పంతో విక్రమ్ ఆదిత్యరెడ్డి నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణకు అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. అదేవిధంగా నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు ప్రస్తుతం జాయింట్ సెక్రటరీగా ఉన్నారు. 6ఏళ్ల నుంచి రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతూ ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నారు. సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో ఒక సీనియర్ జాతీయ స్థాయి క్రీడా పోటీలు, రెండు సౌత్‌జోన్ పోటీలను విజయవంతంగా నిర్వహించారు. సీనియర్ జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ పురుషుల జట్టు రన్నరప్ నిలవగా ఈ జట్టులో విక్రమ్ ఆదిత్యరెడ్డి క్రీడాకారుడిగా తనపాత్ర పోషించారు. సౌత్‌జోన్ టోర్నీలో పురుషుల జట్టు మూడో స్థానం, మహిళా జట్లు రెండు సార్లు మూడో స్థానంలో నిలిచి పతకాలు సాధించాయి.

రూ.6 వేల పింఛన్లు సాధిస్తాం

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ



మహాగర్జన సన్నాహక సదస్సులో సమావేశంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ

మహబూబ్‌నగర్ రూరల్/ధన్వాడ: దివ్యాంగులకు ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణమాదిగ అన్నారు. హామీలు అమలు చేయడం చేతకాకపోతే సీఎం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంతో పాటు నారాయణపేట జిల్లా ధన్వాడలో ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వికలాంగ చేయూత పింఛన్‌దారుల మహాగర్జన సన్నాహక సదస్సులకు ఆయన హాజరై మాట్లాడారు. ఏపీలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు పింఛన్ పెంచి ఇస్తున్నారని.. తెలంగాణలో ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. పింఛన్‌దారుల్లో ఒక్కొక్కరు రూ. 40వేలు కోల్పోయారని ఆగ్రహం వ్యక్తంచేశారు. వికలాంగుల బడ్జెట్ మొత్తం రుణమాఫీకి మళ్లించారని ఆరోపించారు. భూములు ఉన్నవారి అప్పులను తీరుస్తున్న ప్రభుత్వం.. కాళ్లు, చేతులు, మూగ, కళ్లు లేని వారికి మాత్రం ఇచ్చేందుకు ముందుకు రావడం లేదని దుయ్యబట్టారు. పింఛన్ తీసుకునేది నూటికి 99 శాతం పేదలేనని.. రుణమాఫీపై ప్రశ్నించే ప్రతిపక్షాలు పెండింగ్ పింఛన్ల గురించి ఎందుకు అడగడం లేదని మండిపడ్డారు. పేదల కోసమే ప్రభుత్వం పనిచేయాలన్నారు. ఆగస్టు 13న హైదరాబాద్‌లో జరిగే సభకు పెద్దఎత్తున తరలిరావాలని, ఎందుకు అమలు చేయరో తేల్చుకుందామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెడలువంచి దివ్యాంగులకు రూ. 6వేలు, వృద్ధులు, వితంతులు, గీత, చేనేత, బీడీ కార్మికులకు రూ. 4వేల చేయూత పింఛన్ సాధిస్తామని అన్నారు. పేదలకు ఆరోగ్యశ్రీ అందుతుందంటే.. ఎమ్మార్పీఎస్ ఆనాడు చేసిన ఉద్యమ ఫలితమేనని వివరించారు. అనంతరం ధన్వాడలోని ఎస్సీ హాస్టల్‌ను ఆయన పరిశీలించారు. కేవలం ఎనిమిది గదుల్లో 250 మంది విద్యార్థులు ఉండటం బాధాకరమని.. ఆ భవనం కూడా శిథిలావస్థకు చేరిందన్నారు. హాస్టల్‌కు నూతన భవనం నిర్మించాలని అన్నారు. కార్యక్రమాల్లో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరేందర్, ఉపాధ్యక్షుడు బిచ్యానాయక్, జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, ప్రధాన కార్యదరి శ్రీనివాసులు, వీహెచ్‌పీఎస్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పద్మ, నాయకులు జైపాల్‌రెడ్డి, శ్రీలక్ష్మి, పారిజాత, వెంకటేశ్, ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి బొర్ర బిక్షపతి, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివ, నాయకులు శ్రీరాములు, రామచంద్రయ్య, నాగరాజు, వెంకటేష్, ఆంజనేయులు, ఉదయ్‌కిరణ్, రాము, తిమ్మయ్య, రాజన్న, చింతన్‌పుప్ప నర్సింహులు, నారాయణ, రాజు, గుర్రంరాజు తదితరులు పాల్గొన్నారు.

నల్లమలలో ట్రెక్కింగ్



అభయారణ్యంలో ట్రెక్కింగ్ చేస్తున్న వాకర్స్

మన్ననూర్: అచ్చంపేట వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మన్ననూర్ నుంచి ఉమామహేశ్వరం వరకు అటవీ మార్గంలో ట్రెక్కింగ్ నిర్వహించారు. స్థానిక వనమాళికా ప్రాంగణం నుంచి ట్రెక్కింగ్‌కు సిద్ధమైన వాకర్స్‌కు అటవీ మార్గంలో పాటించాల్సిన నియమ నిబంధనలను ఫారెస్టు ఎడ్యుకేషనల్ అధికారిణి శ్వేత వివరించారు. అక్కడి నుంచి సహజసిద్ధమైన ప్రకృతిని ఆస్వాదిస్తూ అటవీ మార్గంలో ఉమామహేశ్వరం వరకు ట్రెకింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ ఫౌండర్ చందు నాయక్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్ మాట్లాడుతూ.. అటవీ మార్గంలో ప్రతి అడుగులోనూ నూతనోత్సాహం కలిగిందన్నారు. ట్రెక్కింగ్ సమయంలో వన్యప్రాణులైన చిరుత, పెద్ద పులి అడుగు జాడలు కనిపించినట్లు చెప్పారు. ట్రెక్కింగ్ సమయంలో గైడ్‌గా వ్యవహరించిన ఎఫ్ఆర్ఓ సుబ్బు, బీఎఫ్ఓ ఆశ, అటవీశాఖ సిబ్బంది ప్రశాంత్, ప్రభాస్, పరుశురాం, ఆంజనేయులు వన్యప్రాణుల జీవన శైలి, వృక్ష సంపద తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘునందన్, హెచ్ఎం బిచ్చా నాయక్, రిటైర్డ్ హెచ్ఎం నర్సోజీ, అశోక్ ప్రసాద్, నిరంజన్, హన్మంత్, రాములు, భాస్కర్, ఖదీర్, ఖాదర్, జమీర్, కాశీలింగం, ప్రమోద్, లక్ష్మీకాంత్, సాయిరాం, హరికృష్ణ, రమేశ్, స్వామి, మాధవాచారి, పుల్లయ్య, నర్సింహ, శివశంకర్, హరి, శ్రీకాంత్, లక్ష్మణ్, హన్య, ప్రకాష్, మల్లేష్, సాదిక్, సత్యం, క్రాంతి పాల్గొన్నారు.

జూరాలకు 1.15 లక్షల ఇన్‌ఫ్లో

కొనసాగుతున్న వరద



జూరాల నుంచి 19 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న వరద

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద వస్తుందని పీజేపీ అధికారులు తెలిపారు. ఆదివారం రాత్రి 9 గంటల వరకు ప్రాజెక్టుకు వస్తున్న 1.15 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుందన్నారు. దీంతో ప్రాజెక్టు 19 క్రస్టు గేట్లను ఎత్తి 74,081 క్యూసెక్కులు, జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 29,464 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 66 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,030 క్యూసెక్కులు, కుడి కాల్వకు 600 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు, భీమా లిఫ్టు- 2కు 750 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 700 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 1.07 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.389 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

లక్ష్యానికి చేరువలో విద్యుదుత్పత్తి

జూరాల ప్రాజెక్టు పరిధిలో ఈ ఏడాది 610 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి లక్ష్యం కాగా.. ఇది వరకే 305 ఎంయూ సాధించారు. ఆదివారం ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ శ్రీధర్ తెలిపారు.

ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు తగ్గిన ఇన్‌ఫ్లో...

ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లో స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. ఆల్మట్టి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 129.72 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 97.416 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 62,167 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. నారాయణపూర్ ప్రాజెక్టుకు 60వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 30.130 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టుకు 65వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 15 క్రస్టు గేట్లను ఎత్తి జూరాలకు ప్రాజెక్టుకు 48,025 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

శ్రీశైలంకు నీటి ప్రవాహం

దోమలపెంట: జూరాల ఆనకట్ట గేట్లు పైకెత్తి స్పిల్‌వే ద్వారా 74,081 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 29,464, సుంకేసుల నుంచి 35,296 మొత్తం 1,38,841 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయం చేరుతోంది. శ్రీశైలం జలాశయంలో 882.7 అడుగుల వద్ద 202.9673 టీఎంసీల నీటి నిల్వ ఉంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 32,173 మొత్తం 67,488 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 20 వేల క్యూసెక్కులు, హెచ్ఎన్ఎస్ఎస్ లిఫ్టు ఇరిగేషన్ ద్వారా 1,013, ఎంజీకేఎల్ఐకు 516 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 17.757 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 17.351 మి.యూనిట్లు విద్యుదుత్పత్తి చేశారు.

సుంకేసులకు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి 37 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. ఎనిమిది గేట్లు తెరిచి 37,263 క్యూసెక్కులను దిగువకు, కేసీ కెనాల్‌కు 2,354 క్యూసెక్కులను వదిలినట్లు జేఈ మహేంద్ర తెలిపారు.

విరబూసిన బ్రహ్మకమలాలు



కోస్గిలో విరబూసిన 9 బ్రహ్మకమలాలు



జడ్చర్ల పట్టణంలో..

ఉమ్మడి జిల్లాలోని పలువురి ఇళ్లలో ఆదివారం రాత్రి అరుదైన బ్రహ్మకమలాలు వికసించాయి. కోస్గిలోని బహార్‌పేటకు వీధికి చెందిన మిస్కిన్ శ్రీనివాస్ ఇంటి ఆవరణలో మూడేళ్ల క్రితం మొక్క నాటగా.. శనివారం రాత్రి ఏకంగా తొమ్మిది పుష్పాలు విరబూసాయి. విషయం తెలుసుకున్న కాలనీవాసులు అక్కడికి చేరుకొని బ్రహ్మకమలాలకు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే జడ్చర్లకు చెందిన సుజాత గృహంలోనూ శనివారం రాత్రి ఒకటి, ఆదివారం మరో పువ్వు వికసించింది. వికసించిన బ్రహ్మకమలం చూస్తే అన్ని శుభాలు కలుగుతాయని నమ్ముతారు.

– జడ్చర్ల టౌన్/ కోస్గి రూరల్

గురుకుల విద్యార్థులకు వైరల్ ఫీవర్



పెద్దకొత్తపల్లి గురుకులంలో విషజ్వరాల బారిన పడిన విద్యార్థులు

పెద్దకొత్తపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలలో 18మంది విద్యార్థులు విషజ్వరాల బారిన పడ్డారు. రెండు రోజుల నుంచి విద్యార్థులు తీవ్రమైన జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతున్నారు. సమాచారం అందుకున్న స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ నారాయణస్వామి గురుకుల పాఠశాలలో వైద్యశిబిరం ఏర్పాటుచేసి.. విద్యార్థులకు అవసరమైన మందులు అందజేసినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అకుల్ తెలిపారు. కాగా, కొల్లాపూర్ మండలం కుడికిళ్లకు చెందిన 9వ తరగతి విద్యార్థి అభిషేక్ తీవ్ర అస్వస్థతకు గురై వాంతులు చేసుకోవడంతో తల్లిదండ్రులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. అయితే గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయ్యిందని ప్రచారం జరగడంతో బీజేవైఎం నాయకులు లింగస్వామి, మార్కేండయ, శివ, తిరుమల్ తదితరులు గురుకులానికి చేరుకొని విద్యార్థులతో ఆరా తీశారు. తాము జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతున్నామని.. ఎలాంటి ఫుడ్ పాయిజన్ కాలేదని తెలిపారు.

నీటికుంటలో వ్యక్తి గల్లంతు

బిజినేపల్లి: పశువులను మేపేందుకు వెళ్లిన ఓ వ్యక్తి నీటికుంటలో పడి గల్లంతయ్యాడు. ఈ ఘటన బిజినేపల్లి మండలం గుడ్లనర్వ గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు గుడ్లనర్వకు చెందిన అయ్యన్న (53) రోజు మాదిరిగానే గేదెలను మేపేందుకు స్థానికంగా ఉన్న రావికుంట సమీపానికి వెళ్లాడు. సాయంత్రం గేదెలు కుంటలో పడగా.. వాటిని బయటికి వెళ్లగొట్టేందుకు గాను అయ్యన్న నీటిలోకి దిగాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి గల్లంతైనట్లు స్థానికులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.